# ఉత్తరాలు

శ్రీమతి యల్లాప్రగడ సీతాకుమారిగారు

సామాన్యంగా రాత్రిపూట రైల్లో ప్రయాణం చేసేటప్పుడు ఏకొద్దిమందో తప్ప చాలామంది జనం నిద్రపోతూనే ఉంటారు. నాకెందుకో కాని ఆ మర్నాడురాత్రికికూడా నిద్రపట్టదు.

అవ్వేళసాయంకాలం ఐదుగంటలకు రైల్లోనుంచి "ఎబల్" సంస్థానంలో దిగాను. ఆసంస్థానం ఇప్పటికీ మాస్నేహితురాలైన "మార్టెస్టు డి ఆర్థస్" కుటుంబానికే చెందిఉన్నది. ఈసెలవలు మూడువారాలూ అక్కడే గడుపుదామని తిన్నగా వాళ్లదేవిడీకే వెళ్లాను. అది ఒక మనోహరమైన దివ్యభవనం. దాన్ని క్రిందటిశతాబ్దంలో వాళ్ల ఏతాతగారి కాలంలోనో నిర్మించారు. కనుకనే ఇంతకాలానికిగూడా ఆప్రాచీనశిల్పంయొక్క గాంభీర్యం, అభేద్యతా, జీవకళా కొంచెంగూడా తగ్గలేదు. ఇంతేగాక ఆభవనం ఒక చిన్నగుట్టమీద నిర్మించడం, ఆగుట్ట చుట్టూ ఒకదట్టమైనవనమూ, దానికిందుగా జలజలలాడుతూ ఓనదీ, ఆనది అవతలవైపు చాలాదూరం వరకూ వ్యాపించిన సస్యక్షేత్రాలూ, వాటిగట్లమీద మంచుతో తడిసిన పచ్చిగడ్డిమేస్తూ నిండుప్రేమతో వెంబడించేదూడల్తో మందంగా అడుగులువేసే పశువులూ,—ఇక ప్రకృతికాంత తననవలావణ్యశోభనంతా అక్కడ వొలకబోసిందంటే ఆశ్చర్యం ఏముంది. ఈసౌందర్యాన్నిచూచి ఆనందించడానికి నేను ప్రతి వసంతరుతువులోనూ ఇక్కడికివచ్చి మహోత్సాహంతో రోజులు వెళ్లబుచ్చుకొని వెళ్తుంటాను.

భోజనాలుకాగానే స్నేహితుడితో ఇట్లా అన్నాను. "మంచిది నాకు ఈసంవత్సరం ఏగది ఏర్పాటుచేశావు?"

"ఆస్ట్రోజు గది."

ఓగంటసేపు బాతాఖానీ కొట్టినవాంత పడుకోడానికి ఆగదిలో ప్రవేశించాను. గదిలో ప్రవేశించగానే ఆస్ట్రోజు, తైలవర్ణం చిత్రంఒకటి పెద్ద సైజులో ఎదురుగా వేలాడుతూ కనిపించింది. ఆమె ముఖం ఆదుమ్ముపట్టిన అద్దంలోనుంచి నాలో ఎక్కువభావాలేమీ కలిగించలేదుకాని, ఆనొక్కునొక్కులజుట్టూ, విశాలమైననుదురూ, సునిశితమైన కళ్లూ, అకళంకశీలవతులైన ప్రాచీన-సాధ్వీశిరోమణులను జ్ఞాపకానికితెచ్చాయి. మా మిత్రుడికుటుంబంలో ఆమెపేరుకు చాలా గౌరవస్థానముంది.

ఇప్పటికి నేను చాలా అలిసిపోయినాను కాని ఇంకా నిద్రరావడములేదు. 'కొంచెంసేపు పక్కమీదపొర్లి ఇక లాభంలేదని ఉత్తరాలయినా వ్రాసుకుందామని అక్కడే కిటికీపక్కగా గోడలో అమర్చిఉన్న 'డెస్కు'ను తెరిచాను. కలమూ కాగితమూ ఏమయినా దొరుకుతాయేమోనని. కాని ఆలోపల పూర్తిగా పాడయిపోయిన ఒక్క ఈకకలంమాత్రం పడేశివుంది. నేను నిరాశతో సొరుగుమూసి వేస్తూవుండగా లోపలవైపుమూలగా ఏదో ఒకపదార్థం మెరుస్తూ కనిపించి నన్ను కాస్తకలవరపెట్టింది. వెంటనే మళ్ళీ ముందుకులాగి ఆపచ్చనిపదార్థాన్ని నారెండువేళ్ల గోళ్లతోనూ గట్టిగాపట్టుకొని నేర్పుగా పైకిలాగాను. అది ఒక బంగారు సూదివంటితాళం చెవి. ఆకస్మికంగా నాతల్లో అనేకఊహాశకటాలు పరిగెత్తాయి. ఏదో ఒకరహస్యాగారం ఈకొత్త పని, ముట్టువల్ల బయలుపడవచ్చు ననే ఒకఉత్సాహంతో ఆ'డెస్కు'నంతా పరిశీలించిచూచాను. చివరకు మొదట సొరుగు కొంచెంఎదురుగా ఒక చిన్నరంధ్రం గనిపించింది. క్షణం ఆలస్యంచెయ్యకుండా ఈసూదిని అందులో గుచ్చాను. ఆశ్చర్యం! వెంటనే ఒక చిన్నసొరుగు నావైపుకు తెరుచుకుంది.

అందులో ఉన్న సామానంతా రెండు, పసుపు పచ్చ, గులాబీ, రంగుల ఉత్తరాలకట్టలు; విలువైన, మృదువైన పట్టుగుడ్డముక్కలో చుట్టబడిఉన్నాయి.

అవ్విచదివి నేను కొంచెం విభ్రాంతుణ్ణయిపోయి నాను. వాటిలోనుంచి ఒకటి రెండుఉత్తరాలు చూపిస్తూఉన్నాను.

“నా.........’

నీవుకోరినవిధంగా నీవు వ్రాసినఉత్తరాలన్నీ పంపిస్తున్నాను. కాని నీకోర్కెను అంగీకరించడానికి నేను చాలా బాధపడుతున్నాను. నీవు దేనికొరకు ఇంతగా భయపడుతున్నావో నేను ఊహించుకో లేకుండాఉన్నాను. వాటిని నేను పోగొట్టుకుంటా నేమోనని భయపడుతున్నావా? జాగ్రత్తగా నా పెట్టిలోదాచి తాళంవేశాను. పోనీ ఎవరైనా దొంగి లిస్తారేమోనని భయపడుతున్నావా? పిచ్చిదానా! నాప్రణయకోశాన్ని నేను కాపాడుకోలేనా!!

నాకు బాధేకాదు ఆశ్చర్యంకూడా వేస్తూఉన్నది. ఒకవేళ నీహృదయాంతరాళంలో పశ్చాత్తాపం ప్రవే శించలేదుగదా. ఇంతకాలం నన్ను ప్రేమిస్తున్నం దుకూ లేకపోతే, నీచేతులోఉన్న కలంమీదఉన్న విశ్వాసంగూడ నామీద నీకు లేనిరోజుల్లో నీభావాల్ని ఒక తెల్లకాగితంమీద ప్రవేశపెట్టినందుకు ఇప్పుడు సిగ్గుపడుతున్నావా? చూడూ, ఎప్పుడైతే మనం ప్రేమించేదానికి ఒప్పుకున్నామో అప్పుడు, ఆప్రేమని మాటలలోనూ, వ్రాతలతోనూకూడా ఒప్పుకో వలిశివస్తుంది. ఎందుకంటావా, ఆలోచించుకో, మనం అనుకున్నమాటలు, మధురమైనసంగీతంలాగా హృదయంలో చొచ్చుకుపోయి, మలయానిలంలాగా మృదువుగా శరీరానికితాకి, సూర్యకిరణాల్లాగా వంటికి వేడిపుట్టించి చివరకు ఆవిరిలాగా మాయం అయిపోతాయి. ఇక అక్కడమిగిలేది ఒక్క స్మృతి మాత్రమే! కావలెనంటే, వాటిని దర్శించడానికిగానీ స్పృశించడానికిగాని, చివరకు చుంబించడానికిగాని వీల్లేదు. ఏమైనాసరే భరింపరాని హృదయవేదనతో ఉత్తరాలు పంపివేస్తున్నాను.

నాకుతెలుసు. నిస్సందేహంగా నీవు, ఒకానొక కాలంలో ఒకమనుష్యమాత్రుణ్ణి ప్రేమించి ఆభావా లను శాశ్వతంగా వెల్లడిపరచినందుకు ఇప్పుడు నీకోమలహృదయంలో పశ్చాత్తాపమూ, భీరుత్వమూ కలిగి, వాటిని ఎలాగైనాసంపాదించి, ధ్వంసంచేసి, పిడికెడుబూడిద చేసివేద్దాం. అనుకుంటున్నావు... సరే...మంచిది.

నీసంతృప్త ప్రశాంత జీవనాన్ని ఆశిస్తూ ఇవిగో నీలేఖలన్నిటినీ, పంపివేస్తున్నాను.

నీ.........

*　　　*　　　*

“మిత్రమా!

నాకు చాలా విచారంకలిగింది. ఎందుకంటే నీవు నన్ను సరిగా అర్థంచేసుకోలేకపోయినావు. చివరకు ఊహించుకోనన్నా లేక పోయినావు.

నేను నిన్ను ప్రేమించినందుకు ఎన్నడూ విచారించ లేదు. ఇకముందుగూడా విచారించను. నా జీవితాం తంవరకూగూడ ఇదేమోస్తరుగా నీకు ఉత్తరాలు వ్రాస్తూనేఉంటాను. కాని నాప్రార్థన ఏమంటే ఆ ఉత్తరాల్ని నీవు చదివినవెంటనే నాకు తిరిగీ పంపించి వెయ్యాలి.

నేను ఎందుకు ఆఉత్తరాలు పంపమని అడిగానో నీకు చెప్పివేస్తాను. కాని నీకు పెద్దహృదయాఘాతం అవుతుందని విచారిస్తున్నాను.

నీవన్నట్లు భావవీధి పరిభ్రమణంలో కాదుగాని ప్రత్యక్షంగా నేను భయపడుతూ ఉన్నాను. ఎందుకో అంటావా, బహుశా అందులో ఏమైనా పొరపాటువస్తే, నాలోపాలు ఇతరులకు తెలియడం కాని అందువల్ల మరొకరికి నష్టంరావడంగాని నా కిష్టంలేదు.

ఈ చెప్పబోయేమాటలు కొంచెందీర్ఘంగా ఆలో చించుకో. నీవూ... నేనూ.... ఇద్దరం.... మరణించి పోవచ్చు. క్షమించాలి. నీవు నీగుర్రంమీదినుండి పడి పోవచ్చు. ఇంకా స్వారిచేస్తూనే ఉన్నావు కాదూ? లేకపోతే ఏదైనా ఆకస్మికవ్యాధి సోకో, గుండె జబ్బువల్లనో ప్రమాదంవల్లనో తలవనితలంపుగా

చనిపోవచ్చు. తెలుసుకదూ మృత్యువు ఒక్కటేకాని దానిమార్గాలుమాత్రం అసంఖ్యాకం, అనూహ్యం కూడాను. అప్పుడు నీచెల్లెలో బావో, వదినో మన ప్రేమలేఖల్ని చూడడం తటస్థించవచ్చు: అప్పుడు వాళ్లు నన్నుప్రేమించి క్షమించి ఇతరుల్తో ఈరహస్యాన్ని, ఇటువంటి రహస్యాన్ని చెప్పడం మానిచేస్తారా! నేను నమ్మను. నేనిప్పుడేదో మహాభయంకరవిషయాన్నిగూర్చి చెపుతున్నట్లూ, మీబంధువులను అనుమానిస్తున్నట్లూ నీకు తోచవచ్చు. కాని మనం అందరం ఇవ్వాళో, రేపో—ముందో, వెనుకో—తప్పకుండా మన్నులో కలిసిపొయ్యేవాళ్లమే. కనుక తదనంతరం ఏభయంకర సంఘటనలూ జరగకుండా ముఖ్యంగా ఇలాంటివిషయాలల్లో ముందే ఎక్కువ శ్రద్ధతీసుకోడం అవసరం.

ఇక నావిషయం—ఈఉత్తరాల్ని నేను నా వ్రాతబల్లలో ఒక రహస్యపుసొరుగులో దాచిఉంచుతాను. ఈసారి నీవువచ్చినప్పుడు, మన రెండుఉత్తరాలకట్టలూ, తమ మృదువైన పట్టుపక్కల్లో శాశ్వతంగా, పక్కపక్కసమాధుల్లో ఉండిపోయిన ప్రేయసీ ప్రియుల్లాగా ఎలా ఉంచబడ్డాయో చూపిస్తాను.

ఐతే నీవు "ముందుగా నీవుమరణిస్తే నీభర్త మన ఉత్తరాలను చూడడా?" అని ప్రశ్నించవచ్చును. ఊఁహూ, నాకావిషయంలో ఏమీ భయంలేదు. మొట్టమొతట అతను నారహస్యపు సొరుగును కనుక్కోనేలేడు. ఒకవేళ నామరణానంతరం కనుక్కొన్నా నేను లెక్కచెయ్యను. నీమటుకు నీవెప్పుడయినా, మరణించినవాళ్ల ప్రేమలేఖల్నిగురించి విన్నావా, లేదు. కారణం ఇది మనమరణానంతరం నాభర్త మన ప్రేమలేఖల్నిచూచినా ఏంచేస్తాడు, కాల్చిబూడిదచేస్తాడు. పురుషహృదయం ఎలాటిదో కొంచెం ఆలోచించావా? అతను బతికివున్న స్త్రీ మీదఅయితే తప్పకుండా పగసాధిస్తాడు. ఆస్త్రీని అగౌరవపరచాడనే ఊహతో తన ప్రతిద్వంద్వితో పోట్లాడుతాడు. అంతేగాదు. ఆస్త్రీ కళ్లముందు అతనిని నాశనంచేయించడానికి ప్రయత్నంచేస్తాడు కూడాను. ఎందుకంటే,...పోనీలే ఎందుకో నాకూ బాగా కారణంతెలీదు. అదే ఆమె మరణానంతరం అయితే ఎంతసాక్ష్యం దొరికినాసరే దాన్ని ఇతరుల కంటబడకుండా నాశనం చేసి తృప్తిపడుతాడు. ఓహో! నాస్నేహితుల్లో ఇలాటి ఆధారాలమీద పిచ్చిగా, కుళ్లుగా, స్వార్థంతో కీచులాడుకున్నవాళ్లనీ అదే మరణానంతరంఅయితే నిశ్శబ్దంగా వాటిని నాశనంచేసినవాళ్లనీ బోలెడు మంది పురుషుల్ని చూచాను.

మరొక్కవిషయం. నేను వీటిని నాశనంచేస్తానేమో అనికూడ నీవు అనుకుంటున్నావు. ఎప్పుడూ కూడ అలాంటి అభిప్రాయాలకు నీహృదయంలో చోటివ్వవద్దు. నేనేకాదు, ఈవిశాలప్రపంచంలో మరే స్త్రీకూడ తాము ప్రేమింపబడుతున్నామని వ్రాయబడ్డఉత్తరాల్ని ఏమాత్రం చెక్కుచెదరనివ్వదు. మా స్త్రీలోకానికి జీవనసర్వస్వమూ, జీవితోద్దేశమూ, నిరీక్షణమూ, సుఖస్వప్నమూకూడ ఇలాంటి ప్రణయచిహ్నాలే. ఈచిన్నచిన్న కాగిదంముక్కలు ప్రణయారాధనకేర్పడ్డ ఆలయాలు. అందులో ప్రణయాధిదేవతలం మేమే మమ్మల్ని ఆరాధించేప్రియులు వ్రాసిన ఈప్రణయలేఖలు మాసౌందర్యానికీ, రేవికీ, చాకచక్యానికీ, ఆకర్షణకీ సంబంధించిన యోగ్యతాపత్రాలు. అవి మాప్రణయకోశాలు. ఇలాటి ఆనందగర్వాలకి కారణభూతాలయిన ఈలేఖల్ని ఏస్త్రీ ప్రాణప్రదంగా కాపాడుకోదు? కనుక ఈఉత్తరాల్ని, నీదగ్గిరుంటే మనఇద్దరికీ క్షేమంకాదు కనుక, నావ్రాతబల్లలో భద్రంగాదాస్తున్నాను. నీవు ఈవిషయంలో నిశ్చింతగా ఉండు...సెలవు...ముద్దులు...

నీ

రోజా."

అప్రయత్నంగా నాకళ్లు 'ఆర్ట్ రోజా' చిత్రం మీదికి ప్రసరించాయి. ఈసారి తడిసినకంబళిలాగా గంభీరంగా ముడుతలుబడ్డఆముఖంలో పైకి ప్రస్ఫుటం అవుతున్న పాతివ్రత్య సదాచారాలవెనుక సూక్ష్మంగా స్వార్థం, కపటం, ద్వంద్వత్వం ఛాయగా గోచరమయినాయి.